# డంప్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలి



నర్సాపూర్: బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న అఖిల పక్షం నాయకులు

- ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా ప్రభుత్వ నిర్ణయం
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనకు ఎమ్మెల్యే మద్దతు

నర్సాపూర్, ఫిబ్రవరి 5: ప్రజల ఆమోదం లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ డంప్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా ఎమ్మెల్యే నిరసన చేపట్టారు. నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అరెస్ట్ చేసి పటాన్‌చెరు బీడీఎల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ విషయంలో ప్రజల అభిప్రాయం తీసుకోకుండానే ప్రభుత్వం అక్రమంగా ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలు, రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం తుంగలో తొక్కుతూ మొండివైఖరి ప్రదర్శించడం సిగ్గుచేటన్నారు. గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తూ 144 సెక్షన్ విధించడం కాంగ్రెస్ పాలనకు పరాకాష్ట అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులను అర్ధ రాత్రి అక్రమంగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ప్యారానగర్ సమీపంలోని పచ్చటి అడవిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో పర్యావరణం కాలుష్యం అవుతుందన్నారు. ఈ డంపింగ్ యార్డ్ మూలంగా వానకాలంలో నర్సాపూర్‌లోని రాయారావు చెరువులోకి కలుషిత నీరు వచ్చి చేరుతుందన్నారు. ప్రజలు ఆగ్రహం చెందకముందే డంపింగ్ యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం రద్దు చేసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ చెత్త మాకొద్దు

నర్సాపూర్, ఫిబ్రవరి 5: హైదరాబాద్ చెత్త మాకొద్దని అఖిల పక్షం ఆధ్వర్యంలో నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో బుధవారం రాస్తారోకో చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి చెత్త తీసుకొచ్చి నర్సాపూర్ సమీపంలోని అడవిలో వేసేందుకు డంప్ యార్డ్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నేడు (గురువారం) నర్సాపూర్ బంద్ ప్రకటిస్తున్నామని తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో నర్సాపూర్ రాయారావు చెరువు నీరు కలుషితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. నిరసనలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ నాయకులు గోడ రాజేందర్, రమేశ్‌యాదవ్, యాదగిరి, అంజిగౌడ్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి



రామాయంపేట ఎస్సైకి తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు పత్రం అందిస్తున్న రెడ్డి సంఘం నాయకులు




నిజాంపేటలో మల్లన్నపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

రామాయంపేట/నిజాంపేట/నర్సాపూర్/చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5: వరంగల్ సభలో రెడ్డి కమ్యూనిటీని కించపరుస్తూ, అసభ్యంగా మాట్లాడిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ తాలుకా రెడ్డి సంఘం సభ్యులు బుధవారం సీఐ జాన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. తీన్మార్ మల్లన్న కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రామాయంపేట రెడ్డి సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ, ఎస్సై బాలరాజుకు ఫిర్యాదు చేశారు. రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట రెడ్డి సంఘం సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెడ్డి కులం పైన అనుచిత వ్యాఖ్యలు చేసి, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ మీద రాజ్యాంగం మాకు కల్పించిన హక్కుల మీద అవహేళన చేయడాన్ని ఖండిస్తూ రెడ్డి కులస్తులు చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యక్తి గత స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చు పెడుతున్న మల్లన్నను మెంటల్ దవాఖానలో చేర్చాలన్నారు.

## ఎమ్మెల్యే అరెస్టును ఖండిస్తున్నాం

- డంపుయార్డు నిర్ణయం వెనక్కితీసుకోవాలి
- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శివ్వంపేట, ఫిబ్రవరి 5: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అరెస్టును ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ అన్నారు. బుధవారం చెన్నాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గుమ్మడిదల మండలం ప్యారనగర్ శివారులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజామోదం లేకుండా దాదాపు 150 ఎకరాల పచ్చని అడవులు, పంట పొలాల మధ్య డంపు యార్డు నిర్మించడానికి పూనుకున్నది. దీనికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే నిరసన తెలిపారు. వందలాది మంది పోలీసులతో వెళ్లి ఎమ్మెల్యేను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. డంపు యార్డు నిర్మాణంతో గుమ్మడిదల, నర్సాపూర్, శివ్వంపేట మండలాలపై కాలుష్య ప్రభావం పడే ప్రమాదముందన్నారు. డంపుయార్డు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకునే వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తామంతా పోరాడుతామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు బోళ్ల భారతి భిక్షపతి, సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాంచందర్‌గౌడ్, బోళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మెదక్‌రూరల్: పాతురులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



చేగుంట: రెడ్డిపల్లి కేజీబీవీలో భోజనం, వంటలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి హైమావతి

**- కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్‌రూరల్, ఫిబ్రవరి 5: మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు బుధవారం మెదక్ మండలంలోని పాతూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్, ఆర్డీవో రమాదేవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, డైనింగ్ హాల్ , తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలని కోరారు. భోజనం వండటానికి ముందే రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యత లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితిలో వినియోగించకుడదని ఆదేశించారు. ఆయన వెంట మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ఐ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు

### రెడ్డిపల్లి కేజీబీవీలో ప్రత్యేక అధికారి హైమావతి

చేగుంట, ఫిబ్రవరి 5: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చేగుంట మండల ప్రత్యేక అధికారి హైమావతి పేర్కొన్నారు. రెడ్డిపల్లి కేజీబీవీని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందించే వంటలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల, గురుకుల హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, ప్రిన్సిపాల్ శ్రీవాణి తదితరులున్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో





బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి రాధాకిషన్

రామాయంపేట, ఫిబ్రవరి 5: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని డీఈవో రాధాకిషన్ తెలిపారు. బుధవారం రామాయంపేటలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. టీచర్లు ప్రత్యేక క్లాసులు నిర్వహించి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్, ఆర్పీలు ఆకుల రాజు, సంతోష్, శంకర్ ఉన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

వెల్దుర్తి, ఫిబ్రవరి 5: పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ప్రముఖ మోటివేటర్ సునీతారాకేశ్ అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వెల్దుర్తితో పాటు కస్తూర్బా, మానేపల్లి, మంగళపర్తి, కుకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధంపై అవగాహన కల్పించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో సైబర్ జాగృత దివస్‌ను పురస్కరించుకుని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ మోసగాళ్లు ప్రజలను నమ్మించి క్రిప్టో పెట్టుబడుల స్కీమ్స్‌లోకి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈమెయిల్స్, సోషల్ మీడియా సందేశాలు పంపించి, ఫేక్ వెబ్ సైట్లు, యాప్స్ సృష్టించి, వాటి ద్వారా క్రిప్టో కరెన్సీ కొనుగోలు చేసి, వాటి పెట్టుబడులు తీసుకుని మాయమవుతారని పేర్కొన్నారు.


### పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 5: సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ శంకర్ అన్నారు. పేట పోలీస్ స్టేషన్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సునీత, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై లక్ష్మణ్ సూచించారు. చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

## ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక



చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5: చిన్నశంకరంపేట ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా వై.బాబు, ఉపాధ్యక్షుడిగా మేడి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా నవీన్, సురేశ్, కోశాధికారిగా యాదగిరి, వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### ఇందిరమ్మ గృహ నిర్మాణం కోసం స్థల పరిశీలన

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 5: పెద్దశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ ఇండ్ల నిర్మాణం కోసం ఎంపీడీవో రఫీకున్నీసా బుధవారం స్థల పరిశీలన చేశారు. ఆమె వెంట ఎంపీవో విఠల్, నాయకులు నారాయణగౌడ్, రఘుపతిరెడ్డి, యాదిరెడ్డి తదితరులున్నారు.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5: పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులకు సూచించారు. బుధవారం చిన్నశంకరంపేటలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ తుది ఓటరు జాబితా విడుదలైందని ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సరి చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాప్రతినిదులు ప్రజలు సహరించాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ మన్నన్ తదితరులున్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

## హత్య కేసులో నిందితుల అరెస్టు

శివ్వంపేట/తూప్రాన్, ఫిబ్రవరి 5: సొంత అన్నకొడుకే కాలయముడై బాబాయ్ మాలోత్ మదన్‌లాల్‌ను హత్యచేసినట్టు దర్యాప్తులో తేలిందని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం తూప్రాన్‌లోని కార్యాలయంలో విలేకరులతో హత్యకు గల వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న శివ్వంపేట మండలం టిక్యాదేవమ్మగూడ పంచాయతీలోని సామ్యతండాకు చెందిన మాలోత్ మదన్‌లాల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసిన విషయం విధితమే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని ముమ్మర దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు. మృతుడు మదన్‌లాల్‌కు, వారి అన్న తారాసింగ్‌కు భూ తగాదాలు ఉన్నాయి. తారాసింగ్ 2016లో ప్రమాదవశావత్తు మృతి చెందాడు. మృతికి కారణం మదన్‌లాల్ అని తారాసింగ్ కొడుకు భరత్‌సేన్ పగ పెంచుకున్నాడు. అప్పటి నుంచి ఎలాగైనా మదన్‌లాల్‌ను చంపాలని అనుకున్నాడు. ఈ నెల 1న రాత్రి ఎలాగైనా చంపాలని జప్తిశివనూర్ గ్రామానికి చెందిన అతని ఫ్రెండ్ మ్యాకల నవీన్‌ను కారు రెంట్‌కు తీసుకుని రాత్రి 8.30 గంటలకు మదన్‌లాల్ ఇంటికి చేరుకున్నారు. మాట్లాడుకుందామని నమ్మించి కాళ్లు పట్టి కిందకు లాగి పడేశాడు. నవీన్ పట్టుకోగా భరత్‌సింగ్ వెంట తెచ్చుకున్న కత్తితో వీపుభాగంలో పొడిచి, చనిపోయాడని నిర్ధారించుకున్నాక కారులో పారిపోయారు. క్లూస్ టీం, కాల్ డాటా, టవర్‌డాటా ఆధారంగా నిందితులను పట్టుకొని విచారించగా, విషయం తెలిపారన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపారు. సమావేశంలో తూప్రాన్ సీఐ రంగకృష్ణ, శివ్వంపేట ఎస్సై మధుకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

## మక్కరాజిపేటలో సొసైటీని ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

చేగుంట, ఫిబ్రవరి 5: మక్కరాజిపేటలో సొసైటీని ఏర్పాటు చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని పలు గ్రామాలకు చెందిన రైతులు బుధవారం వినతి పత్రం అందజేశారు. చేగుంట మండలంలో రెండు సొసైటీలు ఉన్నయని, అందులో ఇబ్రహీంపూర్ సంఘంలో 21 గ్రామాలు ఉండడంతో రైతులకు దూరభారం అవుతున్నదన్నారు. కొత్తగా మక్కరాజిపేటలో ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. మక్కరాజిపేట్, చందాయిపేట్, కర్నాల్‌పల్లి, జేత్రాంతండా, కసాన్‌పల్లి, గొల్లపల్లి, పెద్దశివునూర్ గ్రామాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. మాజీ సర్పంచ్ కుమ్మరి నర్సింహులు, బండి విశ్వేశ్వర్, రాజు తదితరులున్నారు.

## చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



పట్టాభూమిలో నరికేసిన చెట్లు


శివ్వంపేట, ఫిబ్రవరి 5: తాను సాగు చేస్తున్న పొలంలోని చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు పెంటం సత్తయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొంతాన్‌పల్లికి చెందిన రైతు పెంటం సత్తయ్య ఇదే గ్రామానికి చెందిన కైలాశ్ రాంచందర్ గుప్తాకు చెందిన ఐదెకరాల భూమి కౌలు చేస్తున్నాడు. మంగళవారం రాత్రి విద్యుత్ పవర్‌లైన్ సూపర్‌వైజర్ నిరంజన్‌రెడ్డి కోత యంత్రాలతో అక్రమంగా చెట్లు నరికేశాడు. చెట్లు నరికేసిన నిరంజన్‌రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## బాధితులకు కంఠారెడ్డి ఆర్థిక సాయం



నిజాంపేట, ఫిబ్రవరి 5: నందిగామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన జడ్చెరువు తండాకు చెందిన రమావత్ చత్రుకు, కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న రమావత్ రాజేశ్‌కు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5: మెదక్ పట్టణానికి చెందిన కృష్ణమూర్తి బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మృతిచెందాడు. 1993-94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సాయం చేసిన వారిలో జనార్దన్‌రెడ్డి, నర్సింలు, ఆనంద్, ప్రభుదయాళ్, చరణ్, తులసీ, విజయలక్ష్మి, విజయానంద్, మధు, సులేమాన్, కృష్ణాగౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్చారం, ఫిబ్రవరి 5: మండలంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కొల్చారం ఏఈ హైమద్ అలీ బుధవారం ప్రకటనలో తెలిపారు. కౌడిపల్లి నుంచి కొల్చారం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే 133/11 కేవీ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం మండల వ్యాప్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

## అనారోగ్యంతో బీఆర్‌ఎస్ నాయకుడు మృతి



స్వామి (ఫైల్)

నిజాంపేట, ఫిబ్రవరి 5: బచ్చురాజ్‌పల్లి గ్రామ బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ పుష్ప భర్త స్వామి (68) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు స్వామి మృతిపై మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నాయకుడు కంఠారెడ్డి తిరుపతి సంతాపం వ్యక్తం చేశారు.

### సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

రామాయంపేట, ఫిబ్రవరి 5: సంత్ సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, సెలవు దినంగా ప్రకటించాలని రామాయంపేట లంబాడి ఐక్యవేదిక, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు సర్దార్ నాయక్, వినోద్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15న గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ అని, ఆ రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినాన్ని ప్రకటించాలని కోరారు.

## జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

మెదక్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): 2025-26 సంవత్సరానికి మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా అధ్యక్షుడు బొర్లిపు శ్రీనివాస్‌గుప్తా బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలను పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు.

## ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

చేగుంట, ఫిబ్రవరి 5: ఏడాది నుంచి 19 ఏండ్ల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని చేగుంట పీహెచ్‌సీ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీడీవో కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లకు నులి పురుగుల నివారణకు తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రశాంత్, ఎంఈవో నీరజ పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర



మెదక్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు కామారెడ్డిలో రాహుల్‌గాంధీతో బీసీ డిక్లరేషన్‌పై ఇచ్చిన వాగ్దానానికి కాంగ్రెస్ కట్టుబడి ఉండాలి. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీ కులగణన పేరుతో అట్టహాసంగా ప్రారంభించి కేవలం పత్రికలకే పరిమితమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీలపైన వారికున్న కపట ప్రేమ బట్టబయలైంది. పదేండ్ల క్రితం కోటి 65 లక్షల ఉన్న బీసీలను 20 లక్షల మందిని తగ్గించి చూపించడం వారి నిజస్వరూపానికి నిదర్శనం. బీసీ జనాభా ప్రకారం ఇస్తామన్న రిజర్వేషన్లను చట్టప్రకారం విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అమలు చేయాలి. బీసీలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు రాష్ట్రంలో తగిన గుణపాఠం చెబుతాం. సర్వేలోనూ బీసీల శాతాన్ని తక్కువగా చూపారు. బీసీలను మోసం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది.

- బీఆర్‌ఎస్ మెదక్ కన్వీనర్ మామిండ్ల ఆంజనేయులు

## భావితరాలకు మార్గదర్శకం కావాలి

**- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్**



నూతన కార్యవర్గంతో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): అర్థ గణాంక శాఖ ఉద్యోగులు భావితరాల ఉద్యోగులకు మార్గదర్శకం కావాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ సూచించారు. బుధవారం టీఎన్జీవో భవన్‌లో ఆ శాఖ ఉద్యోగుల జిల్లా ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అన్ని శాఖలతో అనుసంధానమై ఉంటారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మంజూరైన ప్రాంతీయ అభివృద్ధి నిధులను మండల సమన్వయకర్తల నివేదికలతో వివిధ శాఖలకు అందజేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తారని, వారి సేవలను ప్రశంసించారు. అధ్యక్షుడిగా జి.సురేశ్, కార్యదర్శిగా ఎం మహేందర్ రెడ్డి, కోశాధికారిగా ఎస్.ఏలియా, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.వెంకటేశ్, సంయుక్త కార్యదర్శిగా జి.సావిత్రి, కార్య నిర్వాహక కార్యదర్శిగా ఆర్.భూమేశ్, ప్రచార కార్యదర్శిగా వై కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎం.నాగలక్ష్మి, ఆర్ నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గానికి జిల్లా కార్యదర్శి మీనికి రాజ్‌కుమార్‌తో కలిసి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా, తెలంగాణ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబార్డినెట్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేందర్, కో కన్వీనర్ కృష్ణ పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం పరీక్షలు చేయాలి

**- జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాస్**



వెల్దుర్తిలో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న శ్రీనివాస్

వెల్దుర్తి, ఫిబ్రవరి 5: ప్రభుత్వ నిబంధనల ప్రకారం డయాగ్నోస్టిక్ సెంటర్లలో పరీక్షలు నిర్వహించాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని డయాగ్నోస్టిక్ సెంటర్లతో పాటు పలు క్లినిక్‌లను తనిఖీ చేశారు. అర్హత, సర్టిఫికెట్ కలిగిన వారు మాత్రమే అనారోగ్య పరీక్షలు చేయాలని, డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. క్లినిక్‌లలో బెడ్‌లు ఏర్పాటు చేయవద్దని, కేవలం ప్రథమ చికిత్స అందించాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించి, చికిత్సలు చేస్తే శాఖారమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని, క్లినిక్‌లను సీజ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

తూప్రాన్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను మూడు భాగాలుగా ఆమోదించిన నేపథ్యంలో మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాలతో నిరసన చేట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల అశోక్, మన్నె శ్రీనివాస్, వసుల నర్సింగరావు, కోరబోయిన ప్రవీణ్‌కుమార్, మన్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ జాబితాలో తప్పులుంటే సమాచారమివ్వాలి



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆనంద్

చిలిపిచెడ్, ఫిబ్రవరి 5: పంచాయతీ కార్యాలయాల్లో ఉంచిన ఓటరు లిస్టులో తప్పులుంటే గ్రామ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలాని ఎంపీడీవో ఆనంద్ సూచించారు. బుధవారం మండలంలోని ప్రజా పరిషత్ కార్యాయంలో వివిధ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం సోమక్కపేట, అజ్జమర్రి గ్రామానికి చెందిన నాయకులు ఆ గ్రామాల్లో ఒక్కటే పోలింగ్ బూత్ ఉందని, మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కోరారు.

## డిజిటల్ పంట సర్వే పరిశీలన

చేగుంట, ఫిబ్రవరి 5: డిజిటల్ పంటల సర్వేలను అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌విన్సెంట్, ఏవో టెక్ వందన పేర్కొన్నారు. నార్సింగి మండలకేంద్రం, సంకాపూర్, జెప్తిశివునూర్ తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న డిజిటల్ పంటల సర్వే నమోదు పక్రియను బుధవారం పరిశీలించారు. ప్రతి గ్రామంలోని ప్రతి రైతుకు సంబంధించిన పంటల సర్వేను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఈవో విజృంభణ. రైతులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

పెద్దశంకరంపేట, పిబ్రవరి 5: కారు అదుపుతప్పి బోల్తాపడి, పలువురికి గాయాలైన ఘటన కమలాపూన్ శివారులో 161వ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. మహారాష్ట్ర నాందేడ్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు టీఎస్ 08హెచ్‌జెడ్4002లో ప్రయాణిస్తున్న ఆనందమ్, సురేఖ లకు తీవ్ర గాయాలయ్యాయి. శంభురాజ్, వర్ష, జ్ఞానేశ్వర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరికి జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఏఎస్సై సునీత ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.